సీటు కదా అది'' అని, ఒక మహిళ అడిగింది. నుంచోవమ్మా అళ్ళు మా ఆఫీసర్లు అని కసిరేడు. వాళ్ళ ఆఫీసర్లు ఆడాళ్ళ సీట్లోకూర్చోవచ్చునన్న మాట.

ఒక్క కుదుపుతో బస్ ఆగింది ఇద్దరు గబగబా బస్ ఎక్కి కండక్టర్ చేతిలో టిక్కెట్లు, యస్. ఆర్. లాక్కుని, అతన్ని దింపేసి చెకింగ్ మొదలుపెట్టారు. సగం బస్ అయింది. ఈలోగా గొడవ మొదలైంది. "ఏయ్ సీటిక్కెట్టేది?''— కండక్టరు బాబు దిగేటప్పుడు ఇస్తానన్నారండి. డబ్బులిచ్చేశాను'' అంటున్నాడు అతను. ఆ చెక్కింగ్‌వ్యక్తి కండక్టర్‌ని ఉద్దేశించి "ఏమోయ్ సత్యం?'' అన్నాడు. "నాకు తెలియదు సార్ అందరికి ఇచ్చేశాను'' అన్నాడు. "దిగవోయ్ చాల్చాల్లే. అయిదొందలు ఫైన్ అయిపోగల్దు'' అని అతన్ని దింపేశారు.

కండక్టర్ అయిదు రూపాయలు తీసుకుని ఇలా అబద్దం చెప్పాడేమిటి? అని ఆలోచిస్తున్న అతని ముఖం మీద దుమ్ముకొట్టి బస్ కదిలింది.

......o.....

# క్షమించు నేస్తం

బ్రతకటానికి ఉద్యోగమే చేయాలా? ఇంకేదైనా వృత్తి చేస్తే జీవించలేమా? కులవృత్తి చేసే వాళ్ళని ఎగతాళి చేయడం సబబేనా? ప్రభుత్వోద్యోగమే గౌరవప్రదమైనదా? ఇటువంటి ఎన్నో ప్రశ్నలు నిరుద్యోగుల మనసుల్లో....

ఆ సాయంత్రం గదిలో కూర్చుని ఆలోచిస్తున్నాను. ఉద్యోగం వచ్చి కొద్దికాలమే అయింది.

ఈలోగా

"ఏమండీ అన్న పిలుపు వినపడింది. రూమ్ తలుపు దగ్గరకు వెళ్ళి చూశాను. ఒక యువకుడు మా ఇంటిగలాయన్ను ఏదో అడుగు

తున్నాడు! అరె! వీడిక్కడికి ఎలా వచ్చాడు అనుకున్నాను. అతను నా చదువులు బడిలో సహాధ్యాయి.

"అరేయ్ నువ్విక్కడున్నావని తెలిసింది. రాత్రికి నీ గదిలో వుండి తెల్లారి వెళ్దామని వచ్చాను'' అన్నాడు వాడు.

"రారా చాలా సంవత్సరాలకు కనిపించావు'' అంటూ అతన్ని లోపలికి ఆహ్వానించి, అతని కోసం స్టవ్ మీద గుప్పెడు బియ్యం పెట్టాను. మజ్జిగ అన్నం తిన్నాకూడా తృప్తిగా, శుభ్రంగా తినొచ్చని నేను వండుకుని తింటున్నాను.

నా ఉద్యోగం సంగతి వివరాలు అడిగాడు. తన ఉద్యోగం వివరాలు అడిగితే ఒరిస్సాలో వ్యాపారం చేస్తున్నానని చెప్పాడు. మంచిదే ప్రభుత్వోద్యోగం వస్తుందని ఎదురుచూసే బదులు ఏదో ఒకటి చేయడం కనీసం కిళ్ళీబడ్డీ పెట్టుకోవడం తెలివైనపనే.

చిన్ననాటి కబుర్లు చాలా హాయిగా తీయగా ఉంటాయి. మధురమైన స్మృతులు, ప్రస్తుత పరిస్థితుల్ని ఒక్కోసారి మైమరపింపచేస్తాయి. మేము క్లాసులో చేసిన అల్లరి పనులు గుర్తుతెచ్చుకొని మనసారా నవ్వుకున్నాము. "ఓల్డ్ ఈజ్ గోల్డ్'' ఇదే కదా.

రాత్రి భోజనాలు చేశాము. వాడు నిద్రపోతున్నాడు. వాడు తిండి తిని, నిద్రపోయే విధానం చూస్తుంటే తిండికి, నిద్రకి కరువొచ్చినట్లుగా తోస్తుంది. వీడు చేసే వ్యాపారం ఏమిటి? నా మనసు నన్ను నిలదీస్తోంది. సభ్యత కాకపోయినా, వాడు భుజం మీద వేసుకున్న సంచీలో ఏముందో చూస్తే, వాడి వ్యాపారం వివరాలు తెలుస్తాయి అనిపించింది.

అతని సంచిలో చాలా కరపత్రాలు. ఒక కరపత్రంలో అతని ఫోటో దాని కింద "ఇతను మూగవాడు, వీళ్ళది ఆంధ్రాలో సంపన్న కుటుంబం. రాజకీయ కక్షలతో ఇతని కుటుంబంలో అందర్ని చంపేస్తుంటే, ఇతను చూశాడు. మాటపడిపోయింది. ఆ దాడిలో ఇతను, ఇతని చిన్నారి చెల్లి

మిగిలిపోయారు. ఆమెకు ఇతను పెళ్ళి చేయాలి, సహాయం చెయ్యండి'' సం. గ్రామాధికారి. ఇలా కొన్నివందల కరపత్రాలు.

అయితే ఇదన్నమాట వీడి వ్యాపారం! తెలుగురాని ప్రాంతం. మూగవాడు కాబట్టి ఎవరూ ఏమీ అడగరు. సెంటిమెంటల్ ఎటాక్, బాగానే వుంది. తెల్లారి ఉదయం

"మిత్రమా. నన్నుక్షమించు రాత్రి నీకు అబద్ధం చెప్పాను''

"కేరే ఆన్, మైడియర్ ఫ్రెండ్. నాకు ఇంకేం చెప్పొద్దు'' అన్నాను నా గుండెల్లో లావా పొంగుతోంది. కొన్ని క్షణాల్లో అతనిపై జాలి, నా కడుపులోంచి దుఃఖం వెల్లువలా నా కళ్ళలోకి చొచ్చుకురాకుండానే వెను దిరిగిపోయాను.

—o—

# వృత్తి విద్య

నేను ఆఫీసుకి వెళ్ళడానికి వాడుకగా వచ్చే రిక్షా రాముడు ఓ రోజు ఓ పదిహేనేళ్ళ కుర్రాడ్ని తీసుకొచ్చాడు. 'బాబూ మా బుడ్డోడు పదో తరగతి పాసయ్యేడు' అని చూపించాడు. నమస్కారం సార్ అన్నాడు ఆ అబ్బాయి వినయంగా. ఇద్దరి మొహాల్లోనూ సంతోషం. "వెరీగుడ్. ఇంద'' అని చొక్కా జేబుకి ఉన్న ఖరీదైన పెన్ను తీసి ఆ అబ్బాయికిచ్చేను, డబ్బిస్తే చిన్నబుచ్చుకుంటాడేమోనని. 'థాంక్యూ సార్' అన్నాడా అబ్బాయి, మొహమాటంగా అందుకుంటూ.

"కాలేజీలో చేరుత్తన్నాను బాబూ ఆడ్ని'' చెప్పాడు రాముడు మర్నాడు. 'అలాగా సంతోషం' అన్నాను. ముందు ముందు చదువు 'కొనాలన్న' సంగతి వాడికి తెలియదు అనుకున్నాను మనసులో.

కొన్నేళ్ళకి నేను సినియర్ ఆడిటర్ని అయ్యాను. రిక్షారాముడి కొడుకు రిక్షాతో వచ్చాడు. "అదేమిటి నువ్వొచ్చావ్? కాలేజీకి వెళ్ళటం